
# జె.కె. రౌలింగ్ మాయాజాల సాహిత్యం

## రచనలతో కోట్లాది ప్రజల హృదయాలను గెలుచుకుంది

**ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది పాఠకుల హృదయాలను గెలుచుకున్న ప్రఖ్యాత రచయిత్రి జె.కె. రౌలింగ్ జన్మదినం సందర్భంగా, ఆమె జీవితం.. సృజనాత్మక ప్రయాణాన్ని పరిశీలిద్దాం. హ్యారీ పాటర్ సిరీస్ ద్వారా ఫాంటసీ సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రౌలింగ్ జీవితం స్ఫూర్తిదాయకమైనది మరియు సాహసోపేతమైనది. జె.కె. రౌలింగ్ గారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు!**

### జీవితం విశేషాలు..

**1965** జూలై 31న ఇంగ్లాండ్‌లోని గ్లౌసెస్టర్‌షైర్‌లోని యేట్‌లో జోన్నే రౌలింగ్ జన్మించారు. చిన్నతనం నుంచే ఆమెకు కథలు చెప్పడం మరియు రాయడం అంటే ఇష్టం. తన చిన్ననాటి స్నేహితుల కోసం కథలు రాసేది, ఆమె సృజనాత్మక ఊహాశక్తి భవిష్యత్ విజయాలకు పునాదిగా నిలిచింది. ఎక్సెటర్ విశ్వవిద్యాలయంలో ఫ్రెంచ్ మరియు క్లాసిక్స్ చదివిన రౌలింగ్, విద్య పూర్తి చేసిన తర్వాత లండన్‌లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌లో పరిశోధకురాలిగా మరియు ద్విభాషా కార్యదర్శిగా పనిచేశారు.




### హ్యారీ పాటర్ ఆలోచన నుంచి అక్షరాలు..

1990లో మాంచెస్టర్ నుంచి లండన్‌కు వెళ్తున్న రైలు ప్రయాణంలో రౌలింగ్‌కు హ్యారీ పాటర్ అనే యువ విజార్డ్ కథ ఆలోచన వచ్చింది. ఈ ఆలోచన ఆమె మనసులో ఒక మాయాజాల ప్రపంచాన్ని సృష్టించింది. అయితే, ఈ సమయంలో ఆమె జీవితంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. 1990లో ఆమె తల్లి మరణం (మల్టిపుల్ స్క్లెరోసిస్ వ్యాధి కారణంగా), 1993లో మొదటి భర్త నుంచి విడాకులు, మరియు ఆర్థిక ఇబ్బందులు ఆమెను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఒక సింగిల్ మదర్‌గా, తన కూతురు జెస్సికాతో కలిసి ఎడిన్‌బర్గ్‌లోని చిన్న అపార్ట్‌మెంట్‌లో జీవించిన రౌలింగ్, తన కలలను వదులుకోలేదు. కేఫ్‌లలో కాగితంపై హ్యారీ పాటర్ కథను రాస్తూ, ఆమె తన ఊహలను వాస్తవంగా మలిచింది.

### హ్యారీ పాటర్ సిరీస్ ప్రపంచంలో సంచలనం

1997లో "హ్యారీ పాటర్ అండ్ ది ఫిలాసఫర్స్ స్టోన్" బ్లూమ్స్‌బరీ ద్వారా విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తర్వాతి రెండు దశాబ్దాల్లో ఆరు సీక్వెల్‌లతో కూడిన ఈ సిరీస్ 600 మిలియన్లకు పైగా కాపీలు అమ్ముడై, 85 భాషలకు పైగా అనువదించబడింది. 2007లో "హ్యారీ పాటర్ అండ్ ది డెత్లీ హాలోస్"తో సిరీస్ ముగిసినప్పటికీ, హ్యారీ పాటర్ ప్రపంచం చలనచిత్రాలు, వీడియో గేమ్‌లు, థీమ్ పార్కులు మరియు నాటకాల రూపంలో గ్లోబల్ మీడియా ఫ్రాంచైజీగా విస్తరించింది. 2008 నాటికి, ఫోర్బ్స్ ఆమెను ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం పొందే రచయిత్రిగా పేర్కొంది.


హ్యారీ పాటర్ ప్రపంచం ఆధునిక సాహిత్యంలో అత్యంత ఆకర్షణీయమైన ఫాంటసీ విశ్వాలలో ఒకటి. యువ విజార్డ్ హ్యారీ పాటర్ మరియు అతని స్నేహితులు హెర్మియోన్ గ్రాంజర్, రాన్ వీస్లీల చుట్టూ తిరిగే ఈ కథలు హాగ్వార్ట్స్ స్కూల్ ఆఫ్ విచ్‌క్రాఫ్ట్ అండ్ విజర్డ్రీలో జరుగుతాయి. మాంత్రికులు, మాయా జీవులు (డ్రాగన్‌లు, గాబ్లిన్‌లు, డిమెంటర్‌లు), మంత్ర దండాలు, మంత్రాలు



మరియు దాచిన సమాజం వంటి అంశాలతో నిండిన ఈ ప్రపంచం మామూలు మనుషులు (మగ్గిల్స్) నుంచి రహస్యంగా ఉంటుంది. ప్రధాన కథాంశం హ్యారీ మరియు చీకటి విజార్డ్ లార్డ్ వోల్డ్‌మార్ట్ మధ్య పోరాటం చుట్టూ తిరుగుతుంది. స్నేహం, ధైర్యం, ప్రేమ, బలిదానం వంటి ఇతివృత్తాలు ఈ కథలలో లోతుగా పొందుపరచబడ్డాయి, ఇవి పిల్లలు, పెద్దలను ఒకే విధంగా ఆకర్షించాయి.

### "కార్మోరన్ స్ట్రైక్" సిరీస్‌తో క్రైమ్ ఫిక్షన్ రంగంలోకి..

రాబర్ట్ గాల్‌బ్రైత్ అనే మారుపేరుతో, రౌలింగ్ "కార్మోరన్ స్ట్రైక్" సిరీస్‌తో క్రైమ్ ఫిక్షన్ రంగంలోకి అడుగుపెట్టారు, ఆమె బహుముఖ రచనా సామర్థ్యాన్ని ప్రదర్శించారు. కొన్ని సామాజిక అంశాలపై ఆమె అభిప్రాయాలు వివాదాస్పదంగా ఉన్నప్పటికీ, రౌలింగ్ సాహిత్యం మరియు పరోపకార రంగంలో ప్రముఖ వ్యక్తిగా కొనసాగుతున్నారు. ఆమె స్థాపించిన లూమోస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా



మల్టిపుల్ స్క్లెరోసిస్ పరిశోధన మరియు పిల్లల సంక్షేమం వంటి కారణాలకు మద్దతు ఇస్తున్నారు.

### సాహిత్య - సాంస్కృతిక ప్రభావం

- **పుస్తకాలు:** 1997 నుంచి 2007 వరకు ప్రచురితమైన ఏడు నవలలు 600 మిలియన్లకు పైగా కాపీలు అమ్ముడయ్యాయి మరియు 85 భాషలకు పైగా అనువదించబడ్డాయి. ఈ పుస్తకాలు యువ పాఠకులలో చదివే అలవాటును పెంచాయి మరియు ఫాంటసీ శైలిని పునర్నిర్వచించాయి.
- **సాంస్కృతిక ప్రభావం:** హ్యారీ పాటర్ పుస్తకాలు సాహిత్య దృగ్విషయంగా మారాయి, పాఠశాలలు, లైబ్రరీలు.. సమాజాలలో చర్చలు మరియు ఫ్యాన్ క్లబ్‌లను ప్రేరేపించాయి. "క్విడ్డిచ్" వంటి కల్పిత క్రీడలు మరియు "హాగ్వార్ట్స్ హౌస్‌లు" (గ్రిఫిండర్, హఫిల్‌పఫ్, రావెన్‌క్లా, స్లిథరిన్) వంటి భావనలు పాప్ సంస్కృతిలో భాగమయ్యాయి.

### పేదరికం నుంచి ప్రపంచ సాహిత్యంలోకి..

పేదరికం నుంచి ప్రపంచ సాహిత్య చరిత్రలో అత్యంత ప్రశంసనీయ రచయిత్రిగా మారిన జె.కె. రౌలింగ్ జీవితం నిరంతర పట్టుదల మరియు సృజనాత్మకత యొక్క కథ. ఆమె "హ్యారీ పాటర్" సిరీస్ ఫాంటసీ సాహిత్యాన్ని పునర్నిర్వచించడమే కాకుండా, తరాలను స్ఫూర్తిపరిచే సాంస్కృతిక దృగ్విషయంగా మారింది. హ్యారీ పాటర్ ప్రపంచం కేవలం కల్పిత కథ కాదుబీ ఇది సృజనాత్మకత, సాహసం మరియు మానవ స్ఫూర్తిని జరుపుకునే విశ్వం.

"జె.కె. రౌలింగ్ గారు, మీ కథలు మా జీవితాల్లో మాయాజాలాన్ని కొనసాగిస్తూనే ఉంటాయి."

**- మహ్మద్ గౌస్, రచయిత**

# మోగంటి జీవన రాగం.. బతుకు సరాగం.!!

## నువ్వూ.. నేనూ.. కలిస్తేనే కదా! బతుకంటే.!,



సంసార నౌక సాఫీగా సాగాలంటే.. ఆలుమగల్లో... ఒకరిమీద మరొకరికి ప్రేమ, నమ్మకం, వుండాలి. ఇవే సంసార సాగరాన్ని తరింప జేసే తారక మంత్రాలు అవి సూర్య చంద్రులంత సత్యాలుపూల పరిమళమంత నిజాలు..మోగంటి సత్యగౌరికి ప్రేమ,అనురాగం, అన్యోన్యత,ఆప్యాయతలంటే ఎంతో ఇష్టం. ప్రేమ, అవగాహన లేనిచోట సంసారం నావ సక్రమంగా ముందుకుసాగదన్నది ఆమె నమ్మకం.ఆ వైనమేదో ఇప్పుడు చూద్దాం..!!

"బాల్యంలో ఆటలు,ఊసులు
మరపురాని మధుర స్మృతులు
గుర్తుందా ! తొలినాటి ఇష్టం
మలినాటి ప్రేమని,
గుర్తుందా ! ఆ మలినాటి ప్రేమకు
కుదురు నమ్మకమే నని
అప్పుడివేమీ తెలియవు
ఒకరంటే ఒకరికి చచ్చేటంత ఇష్టం
దాన్ని ప్రేమంటారని తెలియలేదు
ఏమైతేనేం
మన ముఖానే పొద్దు పొడిచిందా

నేనో మూగను
మరి నువ్వు గడసరివా ! కాదు
మరి పొదుపరివా ! కానే కాదు
మనసునంతా కార్యరూపంలో నిలిపే
ప్రజ్ఞాశీలివిజి
అక్షరాలా మనసెరిగి మసలే
ఓ అద్భుతానివి,ప్రేమమూర్తివి

ఈమధ్య చిన్న నలత భారం
అంతరంగ విహారానికి అవకాశం ఇచ్చింది
ఒక్కసారి,ఒక్కసారి నన్ను కాదనలేని
నీ మంచితనం తాలూకు ఋణాన్ని
ఏమిచ్చి భారం దింపుకోను
భారం దింపుకోగలనేమో గానీ
రుణం తీర్చుకోను
ఎందుకంటే ఇది జన్మజన్మల బంధం

ఫిల్టర్ కాఫీ ఇచ్చో,మంచి భోజనం వడ్డించో
పరస్పరం కోరుకునే సవాలక్షలు సమర్పించో
చేరువౌడాన్ని,ఇంకా చేరువయ్యేందుకు
ఏమీ మిగుల్చుకోని నిరుపేదను
నీ సన్నిధిలో భాగ్య శాలిని

ఏం కావాలో చెప్పు..ఎంతడిగినా చెప్పవు
అందుకే ఈ గుప్పెడు అక్షరాలు
జేబులో వేసుకుంటావో,
నీ చేరుమాలులోమూట గడతావో !
నీ గుప్పెడంత గుండెలో దాచుకుంటావో"!!

జీవన రాగం
మోగంటి సత్యగౌరి.!!

ఆలుమగల బంధం గొప్పది..ఒకరికోసం ఇంకొకరు బతకడంలో ఆనందం వుంది.ఓ సారి మనసిచ్చాక, రిటర్న్ గిఫ్టా ఎదుటివారి మనసు పుచ్చుకున్నాక.. అది జన్మ జన్మల బంధం అవుతుంది. విడదీయరాని ఫెవిక్విక్ అనుబంధమవుతుంది.. ఒకరినొకరు అర్థం చేసుకుంటే సంసారంలోఅపార్థాలు, అనర్థాలు, గొడవలే వుండవు. ఇవి లేనిచోటబంధాలు, అనుబంధాలు, ప్రేమ అస్సలు నిలబడవు.చిన్న తాకిడికే పటాపంచ లైపోతాయి. ఇద్దరి మధ్య ప్రేమ ఎప్పుడు పుడుతుందో? ఎలా పుడుతుందో తెలీదు.. ప్రేమ పుట్టడానికి పెద్ద కారణాలేం అక్కర్లేదు. అది ఎలాగైనాపుడుతుంది. ఎప్పుడైనాపు డుతుంది. ఎక్కడైనా పుడుతుంది.

దానికి సమయం, సందర్భం, అవసరం లేదు.. తొలి ప్రేమ తొలి చూపుల్లోనే పుడుతుంది.. ఈ ప్రేమ కేవలం యవ్వనంలోనే కాదు.. బాల్యంలో, కౌమారంలో, వృద్ధాప్యంలో కూడ పుట్టొచ్చు.. బాల్యంలోసావాసంగా, కౌమారంలో కోర్కెగా, యవ్వనంలో ప్రణయంగా, వృద్ధాప్యంలో తోడూ, నీడగా రూపాలు మారొచ్చు..


కానీ అంతః సూత్రంగా ప్రేమ ఒక్కటే. బాల్యంలో సహజంగానే ఆటలు, ఊసులు, మరపురాని మధుర స్మృతుల చుట్టూతిరుగుతుంది ప్రేమ. తొలినాటి ఇష్టం మలినాటి ప్రేమగా మారుతుంది. ఆ మలినాటి ప్రేమకు కుదురు " నమ్మకం" అవుతుంది. ఆ వయసులో యేం ఇవేం తెలియవు.. ఒకరంటే ఒకరికి చచ్చేటంత ఇష్టం..దాన్నే ప్రేమంటారన్నది కూడా తెలియదు.. మనకు తెలియకుండానే ప్రేమ చుట్టేస్తుంది.

మనకు నచ్చినవారు, ప్రేమించినవారు మన కళ్ళకు ప్రేమ మూర్తిగా కనబడతారు.వారిలో ఏ చిన్న చిన్న లోపాలున్నా ప్రేమ వాటిని కప్పే స్తుంది.!ఒకరికి ఒంట్లో నలతైతే..ఇంకొకరికి కలతే.. మనసువ్యాకులత చెందుతుంది..మనకు బాగోపోయినా అంతకష్టం వుండదుకానీ,మనం ప్రేమించే వారికి ఏమాత్రంబాగోలేకున్నా.. ఓ పట్టాధ జిర్ణించుకోలేం.. ఈ కవయిత్రి మోగంటికే కాదు.. నిజమైన ప్రేమికులందరికీ ఇది.. అనుభ వంలోనిదే.. ఒకరు నలతగా వున్నప్పుడు ఇంకొ కరు కేర్ తీసీకోవడం సహజంగానే జరిగి.. పోయే ప్రక్రియ..ఎందుకంటే ఇది జన్మజన్మల బంధం కదా! మనకు తెలీకుండానే అన్నీ జరిగిపోతాయి.. దానికి ప్రతిగా ఆమెఫిల్టర్ కాఫీఇచ్చో,మంచి భోజనం వడ్డించో, ఎదుటివారి కిష్టమైన సవాలక్షలు సమర్పించో రుణం తీర్చుకోవచ్చు కానీ..ఈ బంధం వన్ సైడ్ కాదు....టూవే లాంటిది.

అతగాడు పడ్డకష్టానికి ప్రతిగా' ఏం కావాలోచెప్పు'? అంటే..దానికి అతగాడి పెదాలపై విరిసిన చిరునవ్వే సమాధానమవుతుంది.ఆమె అతగాడికోసం ఓ గుప్పెడు అక్షరాల్ని గుండెనుంచి తీసి మరీ కాగితం మీద పెడుతుందిసతీరా చూస్తే అది కవిత్వమవు తుంది. దాన్ని అతగాడు తన గుప్పెడంత గుండెలో దాచుకుంటాడు.. ప్రేమను ఏరూపంలోనైనా ఇవ్వొచ్చు. ఇచ్చేవారి మనసులో ఎదుటివారి స్థానాన్ని. బట్టి ఆ ప్రేమాక్షరాలకు పరిమళం అంటుకుంటుంది. ఈ కవయిత్రికి తన బెటరాఫ్ మీద వల్లమాలిన..ప్రేమ.. అందుకే ఆమె అక్షరాల్లో ఇంత పరిమళం.!!

ఇదే! ఆమె జీవనరాగం..ప్రేమ సరాగంలోని పరమ రహస్యం.!!

**- ఎ.రజాహుస్సేన్.!!**



### మన దిశా నిర్దేశం

**విలువలేని దుమ్ము కూడా
ఒక్కోసారి కంట్లోపడి
మనిషిని విలవిలలాడేలా చేస్తుంది
అలాగే.....
కొందరు విలువలేని
మనుషులు కూడా
చాలాసార్లు మాటలతో
బాదపెడతారు
ఊదేసుకుని ముందుకు వెళ్ళడమే
ఉత్తమ లక్షణం.**

**సేకరణ: ప్రభాకర్ ఆడెపు**

## కవిత్వం

### నిన్ను నీవు చదువు..!!



మనిషెప్పుడూ..
అహం బ్రహ్మోస్మి అనుకుంటాడు
నిజానికి వాడెప్పుడూ శూన్యాత్మే
అక్షరజ్ఞానం..
వాడ్ని ఆకాశానికెత్తుతుంది
అదే తలపొగరైన నాడు..
వాడి బతుకు అథః పాతాళమే
ఎదిగిన కొద్దీ ఒదిగున్నవాడే
మనిషవుతాడు..

ముందు నిన్ను నీవు చదువు
ఆపై ఎవరినైనా చదువు
నీ లోపాల్ని తెలుసుకున్నాక
ఇతరుల లోపాలు నీకర్థమవుతాయ్

అందుకే....
మనిషెప్పుడూ..
తనను తాను తట్టుకోవాలి
ఆత్మనే అద్దంగా చేసుకొని
తనను తాను చూసుకోవాలి
మనిషెప్పుడూ...
మొగ్గలా ముడుచోకోరాదు
రోజూ పువ్వులా వికసించాలి..
మానవతా పరిమళం పంచాలి
దైవం మనిషి రూపంలో వుంటాడని
లోకానికి తెలియజేయాలి..

**- ఎ.రజాహుస్సేన్..**

### ప్రకృతి గొప్పది..



నింగి ఇస్తుంది నీటి ధనం,
నేల ఇస్తుంది పంట ధనం,
గాలి ఇస్తుంది ప్రాణ ధనం.
ఏమిస్తున్నావ్ సాటి మనిషికి మనం?
పంచుదాం చిరునవ్వు,
అనందం, సంతోషం.

నిస్వార్థ భావన నిలకడ చేసి,
సుగుణమునే తత్వముగా నింపి,
జీవిస్తే గౌరవం ఇంటిపేరు కాదా మరి?

దుర్మార్గ భావన విడనాడి,
సన్మార్గ లక్షణం అణువణువు పొంది,
ఫలితం పదిమందికి ఇచ్చి జీవిస్తే,
మానవత్వం ఇంటిపేరు కాదా మరి?

కరగమన్నది కరగనిది,
అరగమన్నది అరగనిది,
పదిమందికి పంచేది,
ప్రాణాలు పోసేది విద్య కదా?
నేర్చుకుంటే పండితులమే కదా.

**- కీర్తి తులసి, విద్యానగర్, కరీంనగర్.**

## నన్స్ అరెస్ట్‌పై కొనసాగుతున్న ఆందోళన

**నిర్దేశం, న్యూఢిల్లీ:** ఛత్తీస్‌గఢ్‌లో కేరళ నన్స్ అరెస్ట్ వ్యవహారం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. దుర్గ్ రైల్వేస్టేషన్‌లో జులై 25న కేరళకు చెందిన ఇద్దరు నన్స్ సిస్టర్ ప్రీతి మేరీ, సిస్టర్ వందన ఫ్రాన్సిస్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి. అయితే, ఈ ఘటన ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్లమెంటు వెలుపల సైతం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా పులువురు రాజకీయ నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసనలకు దిగారు. అటు-, కేరళ వ్యాప్తంగా క్రిస్టియన్ వర్గాలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన ఇద్దరు కేరళ నన్స్ లను వెంటనే విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ విల్సన్ .. కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు గిరిజన యువతులతో కలిసి ప్రయాణిస్తున్న నన్స్‌ను బజరంగ్ దళ్ సభ్యులు అడ్డుకున్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మతమార్పిడి చేస్తున్నారని నన్స్ మీద బజరంగ్ దళ్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సదరు యువతులు స్వచ్ఛందంగా ఉద్యోగ అవకాశాల కోసం ఆగ్రా వెళ్తున్నారని, వారి దగ్గర చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని నన్స్ వాదించారు.

## కవిత్వం

### ఆమెలో స్త్రీ



కుర్చీలో అతను
చేతిలో పుస్తకం
కాళ్ల దగ్గర కుక్క పిల్ల
తొందర లేని సమయం

అటుగా వెళుతూ ఆమె
అతను ధరించిన
నిశ్చలతపై
నిలిచిన చూపు

మాటల్లేవు
చిర్నవ్వు
తేలిగ్గా
మరేమీ కాని

ఆమె హృదయంలో
ఏదో తెరుచుకున్నట్టు

గుహ
గుహే అతను అనుకుంటూ
కొంచెం చీకటి
కొంత వెలుతురు
అంతే

అతనే
ఆమెలో
కాఫీ కలుపుతూ
సాయంత్రాలు నడుస్తూ

ఒకానొక రోజు
అడుగుతుంది
నిశ్శబ్దంగా

మాటలు కలిపితే
పొరబడతారేమో

అతని నిశ్శబ్దంలో
సేద తీరుతూ
నిద్ర ద్వారం వద్ద
గుసగుసగా:

జీవితంలోకి
జీవం పాకినప్పుడో
స్త్రీత్వం లాంటిది మేల్కొన్నప్పుడో
నువ్వూ మేలుకో
నన్నూ నిద్ర లేపు

**మూలం: శ్రీనివాస్ రావు**
**స్వేచ్ఛానువాదం: ప్రమోద్ వడ్ల కొండ**

### కల్మషం లేని నవ్వు



స్వచ్ఛమైన నీ నవ్వు
కల్మషం లేని నవ్వు
చిన్నారి పాప లాంటి నీ నవ్వు
ఆ పున్నమి వేళలో
విరబూసిన వెన్నెల పువ్వు

నీ వదనం
అరుణోదయంలో
వికసించిన కమలం
నిర్మలమైన మోములో
ఎన్ని అందమైన భావాలో

ఆ చూపులు అప్పుడే
విచ్చుకున్న మరుమల్లెలు
ఆ మాటలు నాపై కురిపించే
తేనెల జల్లులు
నీ రూపం సంధ్య కాంతుల్లో
మెరిసే శ్రావణ మేఘం
నీ రాగం మనసులో వినిపించే
నవమోహన రాగం

ఏమని వర్ణించను
ఎంతని వర్ణించను
ఎంత వర్ణించినా
ఎంత పొగిడినా ఇంకా
ఎంతో కొంత మిగిలిపోయే
అందమే నీవు..

**- లత రవి**

# మారణహోమమే అంతిమ విజయమా..?

## అలా అనుకునే వారికి ఈ కథ కనువిప్పు!

(వంశీ క్రిష్ణ)

మొన్నీమధ్య నేనొక కన్నడ కథకి ఆంగ్ల అనువాదం చదివాను. నంజనగూడు తిరుమలాంబ 1914లో రాసిన కథ అది. అంతా కలిపి నాలుగు పేజీలు కూడా ఉండదు. కానీ అది నామీద చూపిన ప్రభావం మాత్రం చాలా పెద్దది.

పశ్చిమ కనుమల పాదాల దగ్గర విస్తరించిన అటవీ ప్రాంతాలలో వున్న హలక్కి గిరిజన తెగల గురించిన కథ అది. ఇది 2025 అంటే నూటపదకొండు సంవత్సరాల క్రితం రాసిన కథ. ఇప్పుడంటే కర్ణాటక ప్రభుత్వం వాళ్ళను అదర్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్‌లుగా గుర్తించింది కానీ అప్పటికి వాళ్ళు ప్రమాదకరమైన అడవి మనుషులు మాత్రమే.

ఈ కథ ప్రారంభం కావడమే Long long ago, there was a group of people who were not aware that they were human. They cooed and twittered to one another like birds,and wondered about eating whatever they could find. They were meat-eaters,cannibals అని మొదలు అవుతుంది.



వాళ్లకు మనుషులకు జంతువులకు తేడా తెలియదు. కడుపు నింపుకోవడం ఒక్కటే తెలుసు. బాధ, దుఃఖం,ప్రేమ లాంటి మానవ సహజ భావోద్వేగాలు ఏవీ వాళ్లకు తెలియదు. గుంపులు గుంపులు గా అడవుల చివరి అంచువరకూ వాళ్ళు ఆహార అన్వేషణ లో వెళతారు కానీ ఎక్కడా స్థిరంగా వుండరు. ఒకపూట,లేదా ఒక రాత్రి. అంతే ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ మకాం మార్చేస్తూవుంటారు.

వాళ్ళలో ఒక గుంపు నాయకుడు పేరు సుబ్బా. ఆ గుంపులోని వాళ్ళందరూ సుబ్బా మాట తప్పనిసరిగా వింటారు. ఒకేసారి ఆహారాన్వేషణలో ఆ గుంపు అడవి చివరకు వస్తుంది. గుంపులోని నలుగురు నాలుగు వైపులా ఆహారం కోసం వేటకి హాలక్, హాలక్ అంటూ బయలుదేరుతారు. అందులో ఒకడు అలా నడుచుకుంటూ ఒక చిన్న గ్రామం దగ్గరకు వస్తాడు. నిజానికి అది గ్రామం కూడా కాదు. నాలుగయిదు గుడిసెల సమూహం.

ఈ హాలక్ కొంచెం దూరంలో ఉండి చూస్తుంటే ఒక చిన్న గుడిసెలో ఒక స్త్రీ తన చిన్న పాపను దగ్గరకు తీసుకుని పాలు ఇస్తూ కనిపిస్తుంది. పాప పాలు తాగి నిద్రపోయాక గుడ్డ ఉయ్యాలలో పాపను పడుకోబెట్టి లోపలకు వెళుతుంది. ఇదంతా దూరం నుండి చూస్తున్న హాలక్ ఆ స్త్రీ లోపలకు వెళ్ళగానే పరుగున వచ్చి గుడ్డ ఉయ్యాలలో పడుకున్న పాపను ఎత్తుకుని వెళ్ళిపోతాడు.

పాపను తీసుకుని అతడు వెళ్లేసరికి అందరూ అతడికోసం ఎదురు చూస్తూ వుంటారు.ఆహరం కోసం వెళ్లిన మిగతావాళ్ళు అందరూ వట్టి చేతులతో తిరిగి వస్తారు. ఇక ఆ పూటకి పస్తు పడుకోవడమే అని వాళ్ళు అనుకుంటున్నప్పుడు ఈ హాలక్ పాపను తీసుకుని వెళ్తాడు. పాపను చూసి అందరూ కేరింతలు కొడతారు. ఎప్పుడో కానీ దొరకని మానవ మాసం. వాళ్లకు ఆ పూట పండుగ లాగా ఉంటుంది.

ఆచారం ప్రకారం దొరికిన ఆహారాన్ని నాయకుడు సుబ్బా కొంచెం తిని అనుజ్ఞ ఇచ్చాకే మిగతావాళ్ళు వాటాలు వేసుకుని తినాలి. అందుకని హాలక్ పాపను సుబ్బా చేతుల్లో పెడతాడు. లేలేత పాప. కళ్ళుమూసుకుని చిత్ర నిద్రలో ప్రాచీన స్మృతుల చప్పుడు ఏవో వింటూ ఉంటుంది. సుబ్బా చేతుల్లో పెట్టి అతడు పాప వేలు విరుస్తాడా? చేతిని లాగేస్తాడా అని వాళ్ళందరూ ఎదురు చూస్తూ వుంటారు.

సుబ్బా చేతుల్లో పెట్టగానే పాపకి మెలకువ వస్తుంది. కళ్ళు తెరుస్తుంది. తెరుచుకున్న పాప కళ్ళు విశాలంగా నీలి ముత్యాలు లాగా మెరుస్తూ కనిపిస్తాయి. సుబ్బా తనకు తెలియకుండానే ఆ అందమైన పాప మొహం వైపు ఆశర్యంతో కళ్ళు విప్పార్చుకుని చూస్తాడు. పాప భయంతో గట్టిగా ఏడవడానికి బదులు బూ,బూ అంటూ చిన్న చిన్న శబ్దాలు చేస్తుంది. ఎవరైనా తనను చూసి గగ్గోలు పెట్టడం మాత్రమే తెలిసిన సుబ్బాకి ఒక చిన్న పాప భయపడకుండా బూ, బ్రూ అనటం చాలా వింతగానూ, హాయిగానూ అనిపిస్తుంది.

తనకే తెలియని ఒక వింత ఆకర్షణకు లోనైనా సుబ్బా "ఏమిటిది? ఇలా అవుతున్నది ఏమిటి?" అని లోలోపల గొణుక్కుంటాడు. పాప సుబ్బా వంక చూస్తూ మళ్ళీ నవ్వుతుంది. కాకపోతే ఈ సారి కాస్త పెద్దగా. అంతకు ముందెప్పుడూ అనుభవం లోకి రాని చిన్న నొప్పి ఏదో సుబ్బాకి లోలోపల కలుగుతుంది. సాటి మనిషి పట్ల కలగవలసిన ప్రేమ ఏదో మొదటి సారి అనుభవంలోకి వచ్చినట్టు ఉంటుంది. తన చేతుల్లో ఉన్న ఆ పాప వైపు అలాగే చూస్తూ ఉండిపోవాలి అనిపిస్తుంది. ప్రశాంతంగా, శుభ్రంగా ఉండి, మెరుస్తున్న ఆ కళ్ళ నుండి, లేత మొగ్గ లాగా వున్న చిన్ని ముక్కు నుండి, నవ్వుతున్న పెదవుల నుండి చూపు తిప్పుకోవాలి అనిపించదు. తానేం చేయాలో మరచిపోయిన సుబ్బా ఆ పాప చిన్న ముక్కు మీద, బుగ్గల మీద, పెదవుల మీద మెల్లగా తన బండ వేళ్ళతో మెల్లగా స్పర్శిస్తాడు. ఆ స్పర్శలో సుబ్బా తనను తాను సర్వం కోల్పోతాడు. ఒక తియ్యటి అనుభూతి అతడి వెన్నులోకి పాకుతుంది.




"నాకేమవుతున్నది?" అనుకుంటూనే పాపను రెండు చేతులతో పైకెత్తి పట్టుకుంటాడు. అతడలా పట్టుకోగానే మిగతా వాళ్ళు అందరూ సుబ్బా పాప మెడ విరిచేస్తాడు, వెంటనే తమకు ఇచ్చేస్తాడు అని ఉద్వేగంతో గట్టిగా అరుస్తారు. " ఈ పాప తన చిన్న నవ్వుద్వారా నా లోలోపలకి ఏవేవో మార్మికమైన సందేశాలు పంపిస్తున్నది. ఈ పాప నవ్వు నా లోపల ఏదో వినూత్నమైన తియ్యటి నొప్పికి దారులు వస్తున్నది. ఈ పాప వేళ్ళు ఎలా విరువగలను? ఈ పాప ముక్కును ఎలా చిదిమి వేయగలను? ఈ పాపను ఎలా తినగలను? ఈ పాపను తింటే నేను నా జాతి సర్వ నాశనం అయి పోతుంది?" ఇలా ఏవేవో భావనలు సుబ్బాని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి.



"It is sharing so many mysteries through its laughter. Abbabbh. I can not. I will be ruined if I eat it" అలా అనుకుని పాపను తీసుకుని వచ్చిన హాలక్‌ని పిలుస్తాడు.

"ఈ పాపాను ఎక్కడనుండి తీసుకుని వచ్చావు?' అని అడుగుతాడు

"అదుగో ఆ దూరంగా కనిపిస్తున్న గుడిసెల నుండి!"

"పాపా ఒక్కతే ఉన్నదా?"

"లేదు. తల్లి పాలిచ్చి పాపను అప్పుడే ఉయ్యాలలో పడుకోబెట్టింది. నేను వెంటనే తీసుకుని వచ్చాను"

సుబ్బా గుండె పట్టుకుని ఏడవడం మొదలు పెట్టాడు. ఈ పాప కనపడక ఆ తల్లి ఎంత ఏడుస్తున్నదో కదా. ఇప్పుడు నేను ఏడుస్తున్నట్టుగానే అని ఏడుస్తూనే "ఈ పాపను ఎక్కడ నుండి తీసుకుని వచ్చావో అక్కడకు వెళ్లి భద్రంగా మళ్ళీ ఉయ్యాలలో పెట్టేసి రా!" అని ఆజ్ఞాపిస్తాడు. తన చేతుల్లో ఉండి చేయెత్తి తన చెంపలను తరుముతున్న పాపను భద్రంగా హాలక్‌కి అందిస్తూ "వెళ్ళు.. అమ్మ దగ్గరకు వెళ్ళు" అంటాడు సుబ్బా ! హాలక్ మరు మాట్లాడకుండా పాపను తీసుకుని వెళతాడు.

ఆ తరువాత జరిగింది అంతా చెప్పను కానీ ఆ హాలక్ తెగ నరమాంసం తినడం మానేశారు.

ఇదంతా ఇప్పుడు ఎందుకు రాశానో నాకు తెలియదు. కానీ నాకు ఇప్పుడు నెత న్యాహు కంటే సుబ్బా గొప్ప మనిషిగా కనిపిస్తున్నాడు. సుబ్బా పుతిన్ కంటే గొప్ప నాయకుడుగా కనిపిస్తున్నాడు. ఈ కథను ఎవరైనా వాళ్ళిద్దరికీ వినిపిస్తే బావుండు

(ఈ కథ చదవాలి అనుకుంటే A Teashop in Kamalapura and other classic kannada stories చదవండి)

**- బాతాఖానీ సౌజన్యంతో..**

---

## గుజరాత్‌లో పర్యటించిన ఒమర్ అబ్దుల్లా

- **ఈ పర్యటన ఐకమత్యాన్ని చాటిందన్న ప్రధాని**



**నిర్దేశం, న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇటీవల గుజరాత్‌లో టూర్ చేశారు. ఈ నేపథ్యంలో సీఎం ఒమర్ అబ్దుల్లా.. సబర్మతి రివర్‌ఫ్రంట్‌తో పాటు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సందర్శించారు. అక్కడ దిగిన ఫోటోలను తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ ఫోటోలపై ప్రధాని మోదీ రియాక్ట్ అయ్యారు. సబర్మతి, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద జమ్మూకశ్మీర్ సీఎం టూర్ చేయడం సంతోషకరమని ప్రధాని అన్నారు. అబ్దుల్లా పర్యటన ఐకమత్యాన్ని చాటుతుందన్నారు. భారతీయులు ఇతర ప్రాంతాల్లో టూర్ చేసేందుకు ఈ ఘటన ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుందన్నారు. జమ్మూకశ్మీర్‌కు పర్యాటకం కీలకమైంది. ఇటీవల పెహల్గామ్ దాడితో ఆ రాష్ట్ర ఆదాయం తగ్గింది. ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంతో సీఎం అబ్దుల్లా.. పర్యాటకుల్ని ఆకర్షించేందుకు గుజరాత్ టూర్ చేపట్టారు. ప్రధాని మోదీ తన ఫోటోలపై రియాక్ట్ కావడంతో..

సీఎం ఒమర్ అబ్దుల్లా దానికి కౌంటర్ పోస్టు చేశారు. ట్రావెల్ చేయడం వల్ల మన హద్దులు, మనసులు విస్తరిస్తాయి ప్రధాని గారు అంటూ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో టూరిజం కీలకమైందని, లక్షల మందికి ఆదాయం అదే అన్నారు. అందుకే మా రాష్ట్రానికి వచ్చేలా భారతీయ పర్యాటకుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఓ టూరిజం ఈవెంట్‌లో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం అబ్దుల్లా .. సబర్మతి రివర్ ఫ్రంట్ వద్ద మార్నింగ్ రన్ చేశారు.





---

# సురేంద్ర గాడ్లింగ్ పోరాట జీవితం



## జైలు గోడల మధ్య 8వ జన్మదినం

**నాగపూర్‌కు చెందిన ప్రఖ్యాత మానవ హక్కుల న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్ 1 ఆగష్టున తన జన్మదినాన్ని ముంబాయిలోని తలోజా సెంట్రల్ జైలు గోడల మధ్య జరుపుకున్నారు. ఇది ఆయన జైలులో గడిపే ఎనిమిదో పుట్టినరోజు. 2018 జూన్ 6న భీమా కోరేగాం-ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టయిన తర్వాత, ఏడు సంవత్సరాల రెండు నెలలుగా విచారణ లేదు, బెయిల్ లేదు. ఆదివాసీలు, దళితుల హక్కుల కోసం పోరాడిన ఈ ప్రజా న్యాయవాది జీవితం స్ఫూర్తిదాయకమైనది. సవాళ్లతో నిండినది. ఇది మాత్రమే కాదు, భారతదేశంలో ప్రశ్నించే గళాలకు, అక్రమాలను నిలదీసే వారికి దక్కుతున్న "సత్కారం"కు నిదర్శనం. - యాటకర్ల మల్లేష్**

### సురేంద్ర గాడ్లింగ్: దళిత్-ఆదివాసీ హక్కుల యోధుడు

సురేంద్ర గాడ్లింగ్ నాగపూర్‌లో హ్యూమన్ రైట్స్ లాయర్‌గా ప్రసిద్ధి చెందారు. ఆయన దళిత్ రైట్స్ యాక్టివిస్ట్ కూడా. రెండు దశాబ్దాలకు పైగా, ఆదివాసీలు, దళితులపై అక్రమ కేసులు, హింసలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన అద్భుత వాదనా పటిమతో ఎందరో అమాయకులను జైలు నుంచి విడిపించారు. మహారాష్ట్రలోని మార్జినలైజ్డ్ కమ్యూనిటీల హక్కుల కోసం పనిచేస్తూ, మానవ హక్కుల ఉల్లంఘనలపై గళం విప్పారు. ఆయన భీమా కోరేగాం ఘటనకు ముందు కూడా ఎన్నో కేసుల్లో విజయాలు సాధించారు, ముఖ్యంగా దళిత్ రైట్స్ డిఫెండర్లను ప్రాతినిధ్యం వహించారు. గాడ్లింగ్ జీవితం పోరాటాలతో నిండినది. ఆయన దళిత్ అట్రాసిటీలు, ఆదివాసీల భూమి హక్కులు వంటి అంశాలపై ఫోకస్ చేశారు. ఎన్నో సమయాల్లో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం వ్యతిరేకంగా నిలిచారు. ఆయన పని కారణంగా మార్జినలైజ్డ్ రెలిజియస్ కమ్యూనిటీలకు న్యాయం లభించింది.

### అబద్ధాల పుట్ట భీమా కోరేగాం కేసు

**2018** జనవరి 1న మహారాష్ట్రలోని భీమా కోరేగాం వద్ద దళితులు, ఆదివాసీలు సమావేశమైన సమయంలో హింస జరిగింది. ఈ ఘటనలో మావోయిస్ట్ లింకులు ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. ఎల్గార్ పరిషత్ సమావేశాన్ని హింసకు కారణమని చూపి, పుణె పోలీసులు యాక్టివిస్టులను అరెస్టు చేశారు. సురేంద్ర గాడ్లింగ్‌ను 2018 జూన్ 6న అరెస్టు చేశారు, ఇతరులతో పాటు సుధీర్ ధవాలే, రోనా విల్సన్, శోమా సేన్, మహేష్ రావుత్.

### గాడ్లింగ్ మావోయిస్ట్ లింకులు...?

గాడ్లింగ్ మావోయిస్ట్ లింకులు కలిగి ఉన్నారని, హింసను ప్రేరేపించారని. కానీ, ఆధారాలు ప్లాంటెడ్ ఎవిడెన్స్‌గా ఆరోపణలు వచ్చాయి. UAPA (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం 16 మంది యాక్టివిస్టులు (BK-16) అరెస్టయ్యారు, వీరిలో గాడ్లింగ్ ఒకరు. అరెస్టు తర్వాత, గాడ్లింగ్ బెయిల్ కోసం బాంబే హైకోర్టును ఆశ్రయించారు, కానీ 2021లో రిజెక్ట్ అయింది. ఇప్పటికీ విచారణ మొదలు కాలేదు, ఆధారాల కాపీలు కూడా ఇవ్వలేదు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు ఆయన విడుదల కోసం డిమాండ్ చేశాయి.

### జైలు జీవితం - ప్రస్తుత పరిస్థితి



తలోజా జైలులో గడిపిన ఏడు సంవత్సరాల్లో, గాడ్లింగ్ ఎనిమిదో జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ కాలంలో ఆయన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. కానీ పోరాట స్ఫూర్తి కోల్పోలేదు. BK-16 కేసు ఇప్పటికీ అండర్‌ట్రయల్ స్టేటస్‌లో ఉంది, విచారణ ఆలస్యం అవుతోంది. ఇది భారతదేశంలో ప్రజాస్వామిక, చట్టబద్ధ పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. యాక్టివిస్టులను లేనిపోని కేసుల్లో ఇరికించడం ద్వారా మౌనం చేయడం. సురేంద్ర గాడ్లింగ్ జీవితం ఒక పోరాట కథ. ఆయన వంటి వారు లేకుంటే, దళిత్-ఆదివాసీ హక్కులు మరింత అణచివేతకు గురవుతాయి. ఈ జన్మదినం సందర్భంగా, ఆయన విడుదల కోసం మరిన్ని గళాలు వినిపించాలి. ప్రజాస్వామ్యంలో అక్రమాలను నిలదీసే గళాలకు దక్కుతున్న సత్కారానికి నిదర్శనం!



PRIENTED AND PUBLISHED BY **DYAVATHI NAGARAJU,** PRINTED **AT RATNA GRAPHICS,** 2-3-703/7, THIRUMALA NAGAR COLONY , OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. **EDITOR: DYAVATHI NAGARAJU, (PRGI NO. TGTEL/25/A1805)** CELL NO: 91541 59200